
# సరస్వతీ నమస్తుభ్యం

సింహగిరి



"నాకేమీ అర్థం కావడం లేదు" క్లినికల్ లేబొరేటరీ రిపోర్ట్సును మడిచి సునీత చేతికందిస్తూ డాక్టర్‌గారు అన్నారు.

సునీత సాలోచనగా చూస్తోంది....

వారం రోజులక్రితం ఓరోజు ఉదయం తను ఎప్పటిలానే హడావిడిగా కాలేజీకి వెళ్ళే ప్రయత్నంలో ఉంది. ఆరేళ్ల కొడుకు బుజ్జి కాళ్లకు అడ్డం పడుతూ చెప్పాడు.

"తాతయ్య నాతో మాట్లాడడం లేదే"

"తాతయ్య నీతో మాట్లాడక పోవడమే మిత్రా? అలా అయితే ఆయనకు క్షణం గడుస్తుందా? వెళ్ళు"

"ఊ హూ! హోంవర్క్ కూడా చెప్పడం లేదు"— బుజ్జివెడుతూ సణుక్కున్నాడు.

బుజ్జిగాణ్ణి అలా చెప్పి పంపిందే కానీ, సునీతకు ఏదో సందేహం అస్పష్టంగా మనసులో మెదలింది. ఉదయం కాఫీ కలిపి ఇచ్చే లోపు వంటగదిలోకి కనీసం రెండుమూడు మార్లు తొంగి చూసేవారు. హాల్లో ఏదో వస్తువు కోసం వెదుకు తూన్నట్లు పచార్లు చేసేవారు. ఇచ్చిన కాఫీ కప్పును అందుకుంటూ తన గదికి వెడుతూ బుజ్జిగాణ్ణి కేకవేసేవారు. తరువాత వాడి చదువూ కాసేపు మాటలూ. బుజ్జిగాడు స్కూలుకు వెళ్ళేవరకూ వాడే అతని కాలక్షేపం. సునీత అనుమానంగా తండ్రి గదిలోకి నడిచింది.

అనంతరామయ్యగారు వాలు కుర్చీలో కూర్చొని శూన్యంలోకి చూస్తున్నారు. నిస్తేజంగా ఉన్న అతని చూపుల్లో సన్నగా అస్పష్టంగా మెదులుతోన్న బాధ! సునీత మనసు చివిక్కుమంది. ఆమె తండ్రినెప్పుడూ గతంలో ఆ స్థితిలో చూడలేదు.

"ఏమైంది నాన్నా?" సునీత తండ్రిని చేరుతూ ఆందోళనగా అడిగింది.

అనంతరామయ్యగారు కూతురి ముఖంలోకి ఓమారు చూసి తనను తాను సంబాళించుకునే ప్రయత్నంలో కళ్లజోడు అద్దాలు శుభ్రం చేస్తున్నట్లు పంచె అంచుతో తుడుచుకున్నారు.

తండ్రి ఎప్పుడూ యింతే తానను భవిస్తోన్న బాధను నోరువిప్పి చెప్పడం ఆమె ఎరుగదు. ఏదో మాయని వ్రణం లోలోన సలుస్తూనరాల్ని మెలికలు పెడుతూ కలిగిస్తోన్న బాధను పంటిబిగువున నిగ్రహించుకుంటూన్నట్లు తండ్రి సునీతకు కనిపించాడు. ఆమె ఆ రోజుకు కాలేజీకి సెలవుచీటీ పంపించి తండ్రిని తోడ్కొని డాక్టర్ని సంప్రదించింది.

అనంతరామయ్యగార్కి అనారోగ్యం అంటూ లేదనీ, శారీరకంగా నార్మల్ కండీషన్‌లో ఉన్నారనీ, మరి ఎందుకిలా నలతగా కనిపిస్తున్నారో తనకర్థం కావడంలేదనీ డాక్టరు చెప్పాడు. సాధారణంగా వృద్ధాప్యం మనిషిలో అంతర్గతంగా కొన్ని మానసిక సమస్యల్ని కలిగిస్తాయని చెబుతూ ఎందుకైనా మంచిదని ఏవో విటమిన్ కాప్సూల్సు వ్రాశాడు...

★ ★ ★

మరో వారం గడిచింది.

అనంతరామయ్యగారి పరిస్థితి మరీ అధ్వానంగా తయారైంది. పొద్దున్నే పూచిన పచ్చగన్నేరుపువ్వులా స్వచ్ఛంగా పసిమి ఛాయలో మెరిసిపోతూ ఎప్పుడూ హుషారుగా, ఆనందంగా, కదిలే చైతన్యంలా అందరి మధ్యా తిరిగే వ్యక్తి తనగదిని వీడి బయటకు రావడంలేదు. భోజన పానాదులు గదిలోనే, ఏదో ఒక పుస్తకాన్ని కాసేపు చదువుతూ, కాసేపు బెంగటిల్లిన మనసును సముదాయించుకోలేనట్టు దిక్కులు చూస్తూ అలానే పడక కుర్చీలో అలసటగా వాలిపోతున్న తండ్రిని సునీత నిస్సహాయురాలై

చూసేది.

"నాన్న ఎంతలో ఎంతమారిపోయారు? ఎంతో ఆరోగ్యంగా, ఉల్లాసంగా కనిపించే వారు. అతని వయసు డెబ్బైపై చిలుకంటే ఎవరూ నమ్మేవారు కాదు. అటువంటిది ఈ పదిహేను రోజుల్లో మరో పది సంవత్సరాలు పైన పడినట్లు కనిపిస్తున్నారు."

సునీత తండ్రి పరిస్థితిని వివరిస్తూ ఢిల్లీలో ఉన్న భర్తకు ఉత్తరం రాసింది. మరో రెండు వారాల్లో ట్రైనింగు పూర్తయి తను ఎలానూ వచ్చేస్తున్నట్లూ, ఈలోగా వీలుంటే ముందస్తుగా ఎవరైనా మంచి మానసిక వైద్యుణ్ణి సంప్రదించమంటూ అతను జవాబు వ్రాశాడు.

అనంతరామయ్యగారి పరిస్థితి విని బంధువులు, స్నేహితులు పరామర్శించడానికి వచ్చి వెళ్తున్నారు. అలా ఎవరైనా వచ్చినప్పుడు తండ్రిని నిత్యం మథిస్తోన్న మానసిక సమస్య సూచనప్రాయంగానైనా తెలుస్తుందేమోనని సునీత వారి ముఖల్లోకి ఆశగా చూసేది. వచ్చినవారు విచారాన్ని ప్రకటించి ఏవో జాగ్రత్తలు చెప్పివెళ్ళేవారు.

"పోనీ తనే తండ్రినడిగి తెలుసుకుంటేనో?"

ఊహూ! తండ్రి స్వభావం సునీతకు తెలుసు. చెప్పవలసిన విషయమైతే అడగకుండానే చెప్పేవారు. అలా అడిగి అతని మనసుకు మరింత కష్టం కలిగించడం సునీతకు ఇష్టంలేదు.

అనంతరామయ్యగారి మనసును అంతగా దహించివేస్తూ, కృంగిదీసే విషయం ఏమై ఉంటుందా? అని సునీత తన పరిధిలో తాను ఆలోచించేది. ఎంత ఆలోచించినా ఆమెకు సమస్య అంతుచిక్కేది కాదు.

ఈ స్థితిలో రంగనాథం బాబాయి ఉంటే విషయం కొంతలోకొంత అర్థమై ఉండేది. ఇద్దరూ సమవయస్కులు. విశేషించి ఇరువురి అభిరుచుల్లో సారూప్యత ఎక్కడకు వెళ్ళినా కలిసి వెళ్ళేవారు. గంటల తరబడి కూర్చొనీ చర్చించుకునేవారు. వారు చర్చలలో సునీతకు ఆసక్తి కలిగించే విషయాలు వినవస్తూన్నా— పని వత్తిడి కారణంగా సాధారణంగా దూరంగా ఉంటూండేది.

★ ★ ★

బుజ్జిగాడు తాతగారి మౌనానికి కొన్నాళ్ళు ఇబ్బంది పడినా క్రమేపీ అలవాటయ్యాడు. తండ్రిని సాధ్యమైనంతవరకూ వేధిస్తోన్న మానసిక సమస్య నుండి దూరంగా ఉంచడానికి సునీత కావాలనే బుజ్జిగాణ్ణి నచ్చజెప్పి తండ్రి గదిలోకి పంపిస్తోంది. వాడికిప్పుడు తాతగారు నచ్చారుట. ఏం చెప్పినా అడ్డుపడకుండా వింటున్నారుట. ఇదివరకూ అలా కాదుట. మాట మాటకు అడ్డువస్తూ ఏవేవో ప్రశ్నలు వేసేవారట.



టీచర్: పూర్వం రాక్షసులు, రాక్షస రూపంలో వచ్చి బాధించేవారు
విద్యార్థులు: మాస్టార్ల రూపంలో వచ్చి బాధిస్తున్నారు సార్
కృష్ణ, సుధాకర్
కొమరిపాలెం

"అమ్మా చిన్న తాతయ్య వచ్చారే" కాలేజీ నుండి వస్తోన్న సునీతకు గేటు దగ్గరే అల్లుకుపోతూ బుజ్జిగాడు చెప్పాడు.

"ఎప్పుడో మధ్యాహ్నం అనగా వచ్చారు. ఇంకా తాతగారి గదిలోనే కూర్చున్నారు. తాతగారి కోసం ఇన్ని పుస్తకాలు తెచ్చారే. నాక్కూడా బొమ్మల పుస్తకం ఇచ్చారు" బుజ్జిగాడు చేతులతో సైగ చేస్తూ చెప్పాడు.

రంగనాథం బాబాయి వచ్చారని సునీత గ్రహించింది.

★ ★ ★

"మీ సలహా తీసుకుని నాన్నను మానసిక వైద్యుడికి చూపిద్దామనుకుంటున్నాను"— సునీత మెల్లగా చెప్పింది.

రంగనాథంగారు సోఫాలో వెనక్కుజారగిల్లి సాలోచనగా సునీతను చూస్తున్నారు. బుజ్జిగాడు తన బొమ్మల పుస్తకం తీసుకొని తాతగారి గదికి వెళ్ళాడు.

"మీ నాన్నకు చిత్రమైన దిగులు కబలిస్తోందమ్మా"—

"నేనది గమనించాను బాబాయ్. కానీ ఆయనను వేధిస్తోన్న సమస్యేమిటో నాకు అర్థం కావడం లేదు".

"మీ అమ్మగారు కాలధర్మం చేసినప్పుడు ఆయన కొన్నాళ్ళు దుఃఖించారు. తురవాత తేరుకున్నారు. కానీ దిగులు చెందలేదు"

సునీత మౌనంగా వింటోంది.

"రెండేళ్ళలో స్వదేశం వచ్చేస్తానని చెప్పి మీ పెద్దన్నయ్య అమెరికాలోనే సెటిల్ అయిపోతాననీ, ఓ అమెరికన్‌ను పెళ్లి చేసుకుంటున్నాననీ ఉత్తరం వ్రాసినప్పుడు, మీనాన్న బాధననుభవించాడు. కొన్నాళ్ళకు సర్దుకున్నాడు. కానీ దిగులును దరిచేరనీయలేదు"

సునీతకు ఆ విషయం తెలుసన్నట్లు తల ఊచింది.

"ఐశ్వర్యానికి మించినది లేదని భావించిన మీ చిన్నన్నయ్య ఇల్లరికం నెపంతో అత్తవారిపంచన చేరినప్పుడు మీ నాన్న కొద్ది రోజులు విచారించాడు. తరువాత మరిచిపోయాడు. కానీ దిగులు పడలేదు"

సునీత ఆసక్తిగా వింటోంది.

"మీ నాన్న దిగులుకు కారణం చాలామందికి కారణంగా కనిపించకపోవచ్చు. లేదా అతిస్వల్ప విషయంగా తోచవచ్చు. నాకు తెలుసు మీ నాన్న ఓ సాహిత్యపిపాసి, పఠనం అతడి అభిరుచి, జ్ఞానం జ్ఞానాన్ని సంపాదిస్తుంది. అనే నానుడి నాకు తెలిసినంతలో మీనాన్నకు వర్తించినట్లుగా మరెవరికీ వర్తించదేమో! అప్పుడప్పుడూ మేం వెళ్ళే సాహిత్యసభల్లో ఎప్పుడో, ఎలానో వాడికి ప్రేరణపుడుతుంది. కదలిక కలుగుతుంది. అప్పుడు చూడాలి వాడి ఉద్వేగం, విషయ పరిజ్ఞానం. అయినా వాడికి ఇంకా చదవాలని ఉంటుంది. కొత్త వాళ్ళు రాస్తూన్నారు. కొందరు సాహిత్యం సృష్టిస్తూన్నారు. కొందరు పాఠకుడి కాలక్షేపం కోసం రాస్తూన్నారు. అవీ... అన్నీ చదవాలంటాడు. ఈ తరపు భావవీచికలూ, సంప్రదాయ సాహిత్య రెండూ వాడికి ఇష్టమైన విషయాలే. ఇంత సాహిత్యం, ఇన్ని కొత్తపుస్తకాలు, ఇందరు కొత్త రచయితలూ— అన్నీ చదవాలనుంటుందనీ, అర్థం చేసుకొని గ్రహించవలసిన విషయాలు ఎన్నో ఉన్నాయనీ చెప్తాడు. కానీ...కానీ..."

"...వాడు చదువలేకపోతున్నాడమ్మా. ఏ నాలుగు పేజీలు చదివే సరికి కళ్లు లాగుతూన్నట్లు నొప్పి పెడుతున్నట్లు అనిపిస్తోందట. అలసటగా కనురెప్పలు వాటంతట అవే మూతలు పడుతున్నాయట. మీనాన్న దిగులుకు కారణం అదీ. నేనింకా చదివి అర్థం చేసుకోవలసినది ఎంతో ఉందిరా. కాసేపు చదివితే అలసిపోతూన్నాను. కళ్ళు అప్రయత్నంగా మూతలుపడుతున్నాయి— అని వాపోతూన్నాడు"

సునీత నిర్నిమేషంగా రంగనాథం బాబాయిని చూస్తోంది.

★ ★ ★

మరునాటి ఉదయం సునీత తండ్రి గదిలోకి వెళ్ళింది.

అనంతరామయ్యగారు రంగనాథం తెచ్చిన పుస్తకాల్లోంచి ఓ దాన్ని ఎన్నికొని ఆప్యాయంగా చేత్తో నిమురుతూ హత్తుకుంటూన్నట్లు గుండెలపై నిలిపారు. అతని కళ్లల్లోని ఆరాటాన్ని దిగులు మబ్బులు కమ్ముతూన్నాయి.

ఇరువైపులా పుస్తకాలు నిండిన రేక్స్ మధ్య దిగులుగా పడక కుర్చీలో వాలివున్న అనంతరామయ్యగారు! సునీత తండ్రి చేతిలోంచి పుస్తకం తీసుకొని పక్కనే ఉన్న బల్లపై కూర్చుంటూ.. తండ్రిని ఆప్యాయంగా చూస్తూ..

"పుంభావ సరస్వతీ నమస్తుభ్యం— అనుకొంటూ పుస్తకాన్ని తెరిచి 'తొలిపలుకు' తండ్రికి వినిపించేలా చదవడం ప్రారంభించింది. ★